క్లుప్తంగా

బాల్య మిత్రుడికి అండగా నిలిచిన స్నేహితులు


ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రబృందం

మాడ్గుల: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న స్నేహితుడికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. చేయిచేయి కలిపి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మండల పరిధి అప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన పల్లెటి శివ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ ఇంటికే పరిమితం అయ్యాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న (జెడ్పీహెచ్ఎస్ 2009–2010 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న) బాల్యమిత్రులు అంతా కలిసి గురువారం రూ.60 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. చిన్ననాటి స్నేహితుల కుటుంబాల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా.. కలిసి కట్టుగా చేయూతనిస్తామని తెలిపారు.

లక్ష డప్పుల ప్రదర్శనకు తరలుదాం

ఎమ్మార్పీఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పుల మహా ప్రదర్శనకు లక్షలాదిగా తరలి పోదామని సమితి శ్రేణులు పిలుపునిచ్చారు. గురువారం నానక్‌నగర్ గ్రామంలో మాదిగ, మాదిగ ఉపకులాల కాలనీల్లో డప్పులతో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమానికి తరలి.. ప్రభుత్వానికి మన సత్తా చూపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిద్దాపురం శ్రీకాంత్, బోడ ముత్యాలు, కొండల్, మూలి మహేశ్, మస్కు యాదయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్


శ్రీరాములును సత్కరిస్తున్న నూతన అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్

మీర్‌పేట: ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. బీజేపీ మీర్‌పేట–1, 2 అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన పసునూరి భిక్షపతిచారి, ముఖేశ్‌లు గురువారం శ్రీరాములును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కలసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా శ్రీరాములు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కీసర హరినాథ్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్, తులసి వెంకటేశ్, కాశీరాం యాదవ్, జగన్ తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య, రక్తదాన శిబిరం

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరంతో పాటు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు విస్తృత ప్రచారం

కొందుర్గు: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కొందుర్గులో గురువారం ఇంగ్లిష్ జూనియర్ లెక్చరర్ పరిమళ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేశ్‌కుమార్ గురుకుల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు భోజన వసతి కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలల సాకారానికి వేళాయె

- అర్హులకు రేషన్ కార్డులు, సొంతిళ్లు
- రైతులకు భరోసా..
- గ్రామాల బాట పట్టిన అధికారులు
- ఇళ్లు, సాగు భూముల సర్వే
- అర్హుల జాబితాకు తీవ్రకసరత్తు


ఆమనగల్లు: రాంనుంతలలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ లలిత, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు/యాచారం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడుతోంది. ఏళ్లుగా నిరుపేదలు ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల జారీ, సొంతిళ్లు లేని పేదల కలలు సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లు, అన్నదాతల ఆశలకు తగ్గట్టుగా రైతు భరోసా, కూలీల ఆత్మీయ భరోసా ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఈ పథకాల అర్హుల జాబితాను సిద్ధం చేసేందుకు వ్యవసాయ తదితర శాఖల అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గురువారం నుంచి ఈ నెల 20 వరకు ఇంటింటికీ వెళ్లనున్నారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులతో పాటు.. ఇటీవల కులగణనలో పెట్టుకున్న అర్జీలను పరిగణనలోకి తీసుకుని వివరాల సేకరణ అనంతరం.. జావితాను సిద్ధం చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా రైతుభరోసా స్కీంనకు సాగుకు యోగ్యమైన భూమిని గుర్తించి, అర్హులను ఎంపిక చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు తొలుత ఇళ్లు కట్టుకునేందుకు స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. అర్హులైన రైతులందరికీ భరోసా అందుతుందని అధికారులు భరోసా ఇస్తున్నారు.

సాగుచేయని భూములు 1,358 ఎకరాలు

యాచారం మండల పరిధి పలు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులు సాగు, సాగుకు యోగ్యం కాని భూములను సర్వే చేశారు. తహసీల్దార్ అయ్యప్ప, వ్యవసాయాధికారి రవినాథ్ ఇతర సిబ్బందితో కలిసి ఫార్మాసిటీ గ్రామాలైన తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి అదే విధంగా యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో పర్యటించి వ్యవసాయ భూముల్లో రైతులు ఏఏ పంటలు సాగు చేశారో తెలుసుకున్నారు. సాగు చేయని భూములను గుర్తించారు. సర్వే చేసిన ఆరు గ్రామాల్లో మొత్తం 1,358 ఎకరాల్లో ఏ పంటలు సాగు చేయకుండా వృథాగా ఉన్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వారి రెవెన్యూ రికార్డులను పరిశీలించి, సర్వే నంబర్లు, రైతుల పేర్ల ప్రకారం ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూములను పరిశీలించారు.

ఆమనగల్లులో..

మున్సిపాలిటీ పరిధి వివిధ వార్డుల్లో రేషన్ కార్డుల అర్హుల పరిశీలన ప్రారంభమైంది. జాబితాను అనుసరించి.. అధికారులు అర్హులను గుర్తిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వసంత పర్యవేక్షించారు.

సాగుభూములు..

రైతుభరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యమైన భూములను గురువారం మండల పరిధి రాంనుంతల గ్రామంలో తహసీల్దార్ లలిత, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పరిశీలించారు. సాగుకు యోగ్యం లేని భూములను గుర్తించారు. అర్హులైన రైతులందరికీ భరోసా అందుతుందని తహసీల్దార్ తెలిపారు.


యాచారం: సాగుచేయని భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ అయ్యప్ప, వ్యవసాయాధికారి రవినాథ్


ఆమనగల్లు: సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ వసంత

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి

సీఐ శివకుమార్


పదోన్నతి పొందిన వారితో సీఐ శివప్రసాద్

కడ్తాల్: పదోన్నతితో మరిన్ని బాధ్యతలు పెరుగుతాయని, క్రమశిక్షణతో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని సీఐ శివప్రసాద్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐలుగా పనిచేస్తున్న ప్రసాద్ జీ, నిరంజన్‌లు ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా గురువారం వారిని అభినందించి సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. విధినిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని, ఆపదలో వచ్చేవారితే స్నేహపూర్వకంగా ఉంటూ.. సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అదే సమయంలో శాఖకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఎలాంటి రిమార్కులు లేకుండా పనిచేస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్ఐ వర ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఓటమి గెలుపునకు నాంది


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో మూడురోజులుగా ఎలికట్ట ప్రీమియర్ లీగ్(ఈపీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహించారు. గురువారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం గెలపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయిప్రసాద్‌యాదవ్, శ్రీశైలం, బుడ్డ నర్సింహ, నారం శ్రీపాదరెడ్డి, బెంది నరేశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పథకాల అమలు పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిదిలోని హాజిపల్లి గ్రామంలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఖజానా అప్పుల పాలు అయినప్పటికీ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. షాద్‌నగర్ నుంచి హాజిపల్లి మీదుగా డబుల్ రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, మాజీ ఉపసర్పంచ్ సింగారం సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

హామీల పేరుతో మోసం

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్: ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి దేశమొళ్ల ఆంజనేయులుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అంటూ ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాటిలో ఏ ఒక్క గ్యారంటీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, ఏ గ్రామంలో కూడా 30 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతు భరోసా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలే ఇస్తామని మాట మార్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతు భరోసా ఇవ్వడంలేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, అందులో భాగంగా శుక్రవారం షాబాద్‌లో రైతు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రైతు ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని.. రైతులంతా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల/మొయినాబాద్: మాట్లాడుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేద్దాం

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించే రైతు ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. షాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రైతు ధర్నా సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాబాద్‌లో కేటీఆర్ పాల్గొనే రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు వెంకటయ్య, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాంరెడ్డి, రమేశ్, రాంచంద్రారెడ్డి, ఆరీఫ్, ముక్రమ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ వెంకటేశ్ తదితరులు

ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు ఆటలపై ఆసక్తి చూపాలని ఎస్ఐ వెంకటేశ్ అన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పట్టణంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న నాగిళ్ల శంకర్ స్మారక క్రికెట్ టోర్నీ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేత ఉదయనగర్ కాలనీ టీమ్, 11 ఫైటర్స్ టీమ్‌లకు ఎస్ఐ బహుమతులు ప్రదానం చేశారు. ఆటల్లో రాణిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్లజగన్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, బీఆర్ఎస్ నాయకులు ప్రసాద్, నిర్వాహకులు టిల్లుయాదవ్, ప్రవీణ్ యాదవ్, రాఘవేంద్ర, బంటియాదవ్, శివ, సూర్య, శ్రీదర్, బాలు తదితరులు పాల్గొన్నారు.


లింగరావుపల్లిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

విజేతలకు బహుమతులు ప్రదానం

తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ బహుమతులు అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సిద్దు, ఆమనగల్లు ఏరియా సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం

యాచారం: మండల పరిధి మాల్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల ఏర్పాటుకు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనువాసు ముందుకు వచ్చారు. గురువారం విగ్రహ ఏర్పాటు నిర్వాహకులకు రూ.లక్ష 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నోళ్ల యాదయ్య, జహంగీర్, మల్లేశ్, భాస్కర్, కృష్ణ, లింగం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సామేల్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధి గాంధీనగర్, బీజేఆర్, ముదిరాజ్ బస్తీల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు గురువారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో సీఐటీయూ నాయకుడు ఎల్లేష్, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, సీఐటీయూ నేతలు స్వప్న, సత్యనారాయణ, యాదయ్య, పురుషోత్తం, నర్సింహ్మ, రాణి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేస్తా

బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్: బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడిగా ఎంపికైన అత్తెల్లి అనంత్‌రెడ్డి గురువారం పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలను కలిశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో పార్టీని విస్తరించేందుకు కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలని పార్టీ నేతలు ఆయనకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు శర్వలింగం, పాండురంగారెడ్డి, మాణిక్యరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, విజయసింహారెడ్డి, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వరిసాగు.. జాగ్రత్తలు

జనవరి నెల చివరి వరకు నాట్లు వేసుకోవచ్చు

- నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి
- మండల వ్యవసాయాధికారి వెంకటేశం



షాబాద్: యాసంగిలో జనవరి నెలవరకు వరి నాట్లు వేయొచ్చు. అయితే కొందరు రైతులు డిసెంబర్ 15 నుంచే నాట్లు వేసుకొని మార్చి చివరివరకు పంట చేతికి వచ్చేలా చూసుకుంటారు. ఇలా చేయడంతో పంట చివరి వరకు నీటి ఎద్దడి ఉండకుండా ఉంటుంది. కానీ కొందరు రైతులు ఖరీఫ్‌లో పంట ఆలస్యంగా చేతికి రావడంతో వరినాట్లు వేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను షాబాద్ వ్యవసాయాధికారి వెంకటేశం వివరించారు.

వ్యవసాధికారి సూచనలు..

- నారు తీసే వారం రోజుల ముందుగా ఒక ఎకరం నారుమడికి 3జీ గుళికలు 1కిలో చల్లాలి.
- రెండు, లేదా మూడు కాకుండా ఎక్కువగా 4 నుంచి 6 మొలకలు ఉండేలా నారును నాటాలి.
- సకాలంలో వేసే వరి పంట కన్నా, లేటుగా వేసే పంటలో అడుగు మందులు ఎక్కువగా వేయాలి. యూరియాను నాలుగు దఫాలుగా వేయాలి.
- జింకు సల్ఫేట్ ఎకరానికి 20 కిలోలు తప్పకుండా వేయాలి.
- పొలం వేసేటప్పుడు మొక్కల సంఖ్య ఎక్కువగా వచ్చేట్లుగా దగ్గర దగ్గర వేయాలి.
- వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.
- పొలంలో ప్రతీ 2 మీటర్లకు కాలిబాట ఏర్పాటు చేసుకోవాలి.
- నీము కోటెడ్ యూరియా చల్లుకుంటే పైరు త్వరగా ఏపుగా పెరుగుతుంది.
- ఆలస్యంగా వరినాట్లు వేసే రైతులు 15–20 రోజుల కాల వ్యవధి ఆదా కావాలంటే డ్రమ్‌సీడర్‌తో విత్తుకోవాలి.

గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి

కేంద్ర మాజీ మంత్రి సూదిని జయంతిలో వక్తలు


ఆమనగల్లు: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: 'అత్యున్నత రాజకీయ ప్రమాణాలు పాటించిన గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి. ఆయన నెలకొల్పిన ప్రమాణాలను నేటితరం నాయకులు పాటించాలి' అని పలువురు నేతలు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా గురువారం ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రంగయ్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఉన్నారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: కేంద్రమంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దివంగత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, హన్మానాయక్, బాలరాజు, యాదయ్య, రాజేశ్, షాబుద్దీన్ హీరాసింగ్, జవహర్, యాదయ్య ఉన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, రాములు, విష్ణునేత, రమేష్ గౌడ్, మహ్మద్ బాబా ఉన్నారు.


కడ్తాల్: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మాడ్గులలో..


ఆమనగల్లు: నగరంలోని జైపాల్‌రెడ్డి స్మృతిస్థల్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386